క్లుప్తంగా

62వ డివిజన్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లోని హెల్త్ సెంటర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం శనివారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, జలజీవన్ మిషన్, పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకాల గురించి ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అలంపూరు విజయకుమార్ పీఎం స్వనిధి పథకం, ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఇన్‌చార్జీ వాసా పల్లపరాజు, మండల బీజేపీ ప్రెసిడెంట్ అద్దంకి దామోదర్, వీఎంసీ జోన్ కమిషనర్ మాల్యాద్రి, మెడికల్ ఆఫీసర్ కె.రాజా, హౌసింగ్ ఏఈ ఇరఫాన్, డీపీఓ మహేష్, సివిల్ సప్లయిస్ అధికారి శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పింఛన్ అందజేసిన వలంటీర్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఊపిరితిత్తుల సమస్యతో ఎస్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శాంతినగర్‌కు చెందిన మధిర రమాదేవికి శనివారం 257వ వార్డు సచివాలయం వలంటీర్ ఎస్‌కే బాషా ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. గత నెల 30వ తేదీ నుంచి రమాదేవి అనారోగ్య సమస్యలతో ఎస్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో పెంచిన పింఛన్‌ను వలంటీర్ శనివారం ఉదయం ఎస్ఆర్ఐ ఆసుపత్రికి వెళ్లి అందజేశారు. తాను ఆసుపత్రిలో ఉన్నప్పటికీ వెతుక్కుంటూ వచ్చి పింఛన్ అందజేసిన వలంటీర్ బాషాకు రమాదేవి, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో శనివారం అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. దావు బుచ్చయ్యకాలనీ వాసులు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికీ వెళ్లి అయోధ్యనగర్ నుంచి వచ్చిన అక్షింతలు, అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిరం ఫొటో, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు ఈ నెల 22వ తేదీ వరకు అక్షింతలను పవిత్రంగా ఉంచి శ్రీరామ జయ జయ రామ అంటూ 108 సార్లు పారాయణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మధు, సుబ్రహ్మణ్యం, మురళి, రమేష్, నాగరాజు, కనకాల వరప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర ఆలయంలో తిరుప్పావై దివ్య ప్రవచనం



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో శనివారం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యాన తిరుప్పావై దివ్య ప్రవచనం జరిగింది. ప్రముఖ ప్రవచకురాలు రాజ్యలక్ష్మీ 21వ పాసురం అష్టాక్షరీ మంత్ర వైభవంపై ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ధనుర్మాసం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ఉప్పులూరి శేషప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మానవ జీవితంలో వృద్ధాప్యదశ కీలకం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానవ జీవితంలో వృద్ధాప్యదశ ఎంతో కీలకమైనదని, వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరిపై ఉందని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. వాంబేకాలనీలోని మాతృదేవో భవ సేవా సంస్థ ఆశ్రమంలోని వృద్ధులకు ఆ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ సమీనాఫాతిమా ఆధ్వర్యంలో పండ్లు, బిస్కెట్లు పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమతో ఉండాలని, వృద్ధాశ్రమాల ద్వారా వారిని ఆదరించాలని సూచించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు షేక్ రఫీ, మస్తాన్, సయ్యద్ మస్తాన్‌షరీఫ్, ఎండీ ఇస్మాయిల్, రఫీ, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మా భవానీ.. దుర్గాభవానీ



ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణలు కొనసాగుతున్నాయి. పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భవానీలు శనివారం అమ్మ వారి సన్నిధికి తరలివచ్చారు. గిరిప్రదక్షిణ చేసిన అనంతరం అమ్మ వారిని దర్శించుకుని, ఇరుముడులను సమర్పించారు. దుర్గమ్మ నామస్మరణతో ఇంద్రకీలాద్రి, వన్‌టౌన్ పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





11న తుర్లపాటి సంస్మరణ సభ

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, జీఆర్‌కే, శ్రీ కళాభారతి, కృష్ణ కళాభారతి, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ గురువారం సాయంత్రం గాంధీనగర్‌లోని కొత్తాపూర్ణానందం కళావేదికమీద సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తుర్లపాటి కుమారుడు జవహర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో అనేక సంచలనాలు సృష్టించిన తుర్లపాటి గురించి నేటి తరానికి తెలియజేయడానికి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్వర్ణాంధ్ర పత్రిక సంపాదకుడు కేబీజీ తిలక్‌తో పాటు తుర్లపాటి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే సినీ సంగీత విభావరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ళ నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, చీదెళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్‌లు

- ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం
- ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా కులమత, రాజకీయాలకు అతీతంగా పింఛన్లు అందజేస్తున్నామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడులో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు పెనుమత్స శిరీష, కొంగితల లక్ష్మీపతి, శర్వాణీమూర్తిలతో కలిసి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ గతంలో పింఛన్ కోసం అవ్వాతాతలు ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన



పింఛన్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

తర్వాత ఒకటో తేదీ తెల్లవారుజామున తలుపు తట్టి ఇంటివద్దనే పింఛన్ అందిస్తున్నామని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను మూడు వేల రూపాయలకు పెంచడంతో పాటు అర్హత కలిగిన వారందరికీ పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెనుమత్స సత్యం, గుండే సుందర్‌పాల్, వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డెమొక్రటిక్ పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): డెమొక్రటిక్ పీఆర్టీయూ ఆంధ్రప్రదేశ్ శాఖ 2024 డైరీని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను, ఇతర నేతలు మంత్రి విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిశారు. మంత్రి బొత్స చేతుల మీదుగా డైరీని ఆవిష్కరింపచేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్, ఏపీ జీఎల్ఐ బకాయిలను చెల్లించడానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని మంత్రి బొత్స సత్యనారాయణ హామి ఇచ్చినట్లు శ్రీను తెలిపారు. పీజీటీలకు పూర్తిస్థాయి స్కేలుతో ఉద్యోగోన్నతులు కల్పించాలని, సీనియర్ హెచ్‌ఎంలకు ప్రిన్సిపాల్స్‌గా ప్రమోషన్లు ఇవ్వాలని కోరగా



డెమొక్రటిక్ పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. సంఘ నేతలు జ్ఞానేశ్వర్‌రావు, ఎం.వి.నాగేంద్రరావు, ఎస్.జోజయ్య, రాజేష్, ఇ.వెంకటరెడ్డి, నాయక్, వెలగలేరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరవస్తు చిన్నయ సూరి పీఠానికి పూర్ణకుంభ పురస్కారం



శోభనాద్రికి పూర్ణకుంభ పురస్కారాన్ని అందజేస్తున్న గజల్ శ్రీనివాస్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల అధినేత, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరుగుతున్న రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా విజయవాడకు చెందిన శ్రీమాన్ పరవస్తు చిన్నయ సూరి సాహితీ పీఠానికి పూర్ణకుంభ పురస్కారం లభించింది. బాల వ్యాకరణం, నీతి చంద్రిక, పీతి సంగ్రహం వంటి రచనలతో తెలుగు భాషాభివృద్ధికి పరవస్తు చిన్నయ సూరి విశేష కృషి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన వర్గీయులుగా పరవస్తు చిన్నయ సూరి ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్న పీఠానికి ఈ పురస్కారం దక్కింది. పీఠం తరుపున అధ్యక్షుడు టి.శోభనాద్రికి ఏపీ హైకోర్టు జస్టిస్ బి.కృష్ణమోహన్, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పి.గౌతంరెడ్డి ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి ఎస్పీ శేషగిరిరావు, కోశాధికారి ఏవీ ఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ రామలింగేశ్వరపేటలో రూ. 40 లక్షలతో నిర్మించనున్న క్రాస్ రోడ్డు నిర్మాణ పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కో-ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణిలతో కలిసి శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ డివిజన్‌లో గత నాలుగున్నరేళ్లలో రూ. 10 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. ప్రజల అవసరాల మేరకు డివిజన్‌లో ఆరోగ్య కేంద్రంతో పాటు లోటస్ ల్యాండ్ మార్క్, అయోధ్యనగర్, రామలింగేశ్వరపేట ప్రాంతాల్లో రోడ్లు వేశామని చెప్పారు. ఇప్పుడు మిగిలిన క్రాస్ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి రోడ్డును అం



రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

దుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చన్నగిరి రామ్మోహన్‌రావు, కొంగితల లక్ష్మీపతి, డీఈ(ఇంజినీరింగ్) గురునాథం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంచార్జి గుండె సుందర్‌పాల్, నాయకులు ఒగ్గు గవాస్కర్, పేరం త్రివేణిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పూర్ణమ్మ



విజయదుర్గానగర్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం శనివారం జరిగింది. వైద్య శిబిరాన్ని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిబిరంలో అమరావతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు నాదెండ్ల వేణు, కేతినేని శైలజ కంటి పరీక్షలు చేశారు. మిత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ తరపున డాక్టర్ భాస్కర్‌ప్రకాష్, కె.వి సత్యనారాయణ ఎముకలు, జనరల్ మెడిసిన్‌పై అవగాహన కల్పించారు. దుహిత మల్టీ స్పెషాలిటీ డెంటల్ సెంటర్ డాక్టర్ నల్లూరి శ్రీధర్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు చేశారు. హియరింగ్ సొల్యూషన్స్ తరపున ఆడియాలజిస్ట్ సతీష్ వినికిడి పరీక్షలు నిర్వహించారు. పాఠకులు, విద్యార్థులు శిబిరంలో ఉచిత వైద్య సేవలు పొందారు.

విజయదుర్గానగర్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ విజయదుర్గానగర్‌లో శనివారం చైల్డ్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఎమ్మెల్యే వెలంపల్లిని మర్యాదపూర్వకంగా కలిసిన కార్పొరేటర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమితులైన పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. భవానీపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం వెల్లంపల్లి శ్రీనివాసరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి కార్పొరేటర్లు శాలువాతో వెలంపల్లిని సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటామని, పార్టీ నిర్ణయం తమకు శిరోధార్యమని పేర్కొన్నారు. పార్టీ విజయానికి పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. వెలంపల్లిని కలిసిన వారిలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఇసరపు దేవి, షాహినా సుల్తానా, ఉమ్మడి రమాదేవి, బాలి గోవింద్, కుక్కల అనిత, సీనియర్ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, బంకా భాస్కర్, ఇసరపు రాజా, అలంపూర్ విజయ్, బెవర నారాయణ, శ్రీరాములు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును సత్కరిస్తున్న సెంట్రల్ కార్పొరేటర్లు, నాయకులు

భారతీయ తాత్విక విలువలకు అద్దం పట్టిన రచనలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి రచనలు భారతీయ తాత్విక విలువలకు అద్దం పడతాయని మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరుగుతున్న విజయవాడ పుస్తక మహోత్సవం ఆవరణలోని కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై ఇదీ మన భారతీయం పేరుతో కొత్త సచ్చిదానందమూర్తి ఉపన్యాసాల అనువాద పుస్తకాన్ని ఇంతియాజ్ శనివారం ఆవిష్కరించారు. సచ్చిదానందమూర్తి కుమారుడు రఘునాథ్ ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. సిద్ధార్థ కళాశాల డీన్ జంపాల రాజేష్, వెలగా జోషి, కొత్త రమేష్, డాక్టర్ నారాయణరావు, విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జీ, కవి గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అనగనగా కరణం కథలు పుస్తకావిష్కరణ

సుతిమెత్తగా, పరోక్షంగానైనా పాఠకుల మనసుకు హత్తుకునే విధంగా హితబోధలు చేయగల శక్తి మంచి కథకులకు మాత్రమే ఉందని డాక్టర్



అనగనగా కరణం కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌వీవీ ప్రసాద్ తదితరులు

ఎస్‌వీవీ ప్రసాద్ అన్నారు. పుస్తక మహోత్సవం వేదికపై పాత్రికేయుడు కరణం కళ్యాణ కృష్ణ రాసిన అనగనగా కరణం కథలు పుస్తకాన్ని ప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. వేగవంతమైన నేటి సమాజంలో కథకుల అవసరం, కథల అవసరం చాలా ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కవి మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కథలలో, కవిత్వంలో ఉన్న మాధుర్యాన్ని మార్కెటింగ్ మాయాజాలం నుంచి కాపాడాలంటే చిన్న కథకులను పాఠకులు ప్రోత్సహించి, వారి రచనలను ఆదరించాలన్నారు. పాత్రికేయుడు నండూరి రాజగోపాల్ మాట్లాడుతూ కల్యాణ్ రాసిన కథలు మధ్యతరగతి జీవితంలోని వివిధ కోణాలను ఆవిష్కరించాయన్నారు.

నేడు ముగింపు సభ

నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరుగుతున్న 34వ పుస్తక మహోత్సవం ఆదివారం సాయంత్రంతో ముగియనుంది. డిసెంబర్ 28వ తేది మొదలైన ఈ పుస్తక మహోత్సవం ఆదివారంతో ముగియనుంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు పుస్తక మహోత్సవం ఆవరణలోని కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై జరిగే ముగింపు సభలో ఏపీ మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ కాంతిరాణా, సినీ నటుడు తనికెళ్ల భరణి, ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ముగింపు సభ అనంతరం పుస్తక మహోత్సవం సందర్భంగా విద్యార్థులకు, యువకులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

విశ్వజనీన సంస్కృతి ఏదీ లేదు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సంస్కృతి అనేది ఆయా ప్రాంతాలకు పరిమితమైన విషయమని, విశ్వజనీనమైన సంస్కృతి అంటూ ఏదీ లేదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసం దేశమంతా ఒకే సంస్కృతి అనే వాదాన్ని ప్రచారంలోకి తెస్తున్నారని ఆయన అన్నారు. పుస్తక మహోత్సవం వేదికపై ప్రజాశక్తి బుక్ హౌస్ వారి ప్రచురణలు 'ప్రజా సంస్కృతి,



ప్రజా సంస్కృతి, ప్రపంచీకరణ స్వేచ్ఛ కుదింపు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రాఘవులు

'ప్రపంచీకరణ – స్వేచ్ఛ కుదింపు' రెండు పుస్తకాలను ఆయన శనివారం ఆవిష్కరించారు. ప్రజా సంస్కృతి అనే పుస్తకాన్ని ఈఎంఎస్ నంబూద్రిపాద్, 'స్వేచ్ఛ కుదింపు' పుస్తకాన్ని ప్రభాత్ పట్నాయక్‌లు రాశారు. మొదటి పుస్తకాన్ని సత్యరంజన్, రెండో పుస్తకాన్ని ఎంవీఎస్ శాస్త్రి తెలుగులోకి అనువదించారు. జనవిజ్ఞానవేదిక వారి పాటల సీడీని ఆవిష్కరించారు. సభకు ప్రజాశక్తి బుక్ హౌస్ సంపాదకుడు ఎస్.వెంకట్రావు అధ్యక్షత వహించారు. సాహితీ స్రవంతి సంస్థ రాష్ట్ర కార్యదర్శి సత్యరంజన్ పుస్తకాలను పరిచయం చేశారు. సభలో పుస్తక మహోత్సవ సంఘం గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జీ, అధ్యక్షుడు మనోహర్ నాయకుడు, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు, జననాట్యమండలి గేయ రచయిత దేవేందర్ పాల్గొన్నారు.

అత్తింటి వారి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేధింపులకు పాల్పడుతున్న అత్తింటి వారిపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబర్ 95కి చెందిన కట్టా మహాలక్ష్మి, కట్టా గోపి 2016వ సంవత్సరంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పెళ్లి అయిన కొంత కాలం గోపి భార్యను బాగానే చూసుకునే వాడు. కొద్ది రోజులుగా గోపి పనికి వెళ్లకుండా భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. దీనిపై అత్తకు చెప్పినా ప్రయోజనం లేకపోగా వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సమాజ శ్రేయస్సుకు అందరం కృషి చేయాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వివిధ ఆలోచనలు, విధానాలు, సిద్ధాంతాల ప్రాతిపదికగా సమాజ శ్రేయస్సు కోసం అందరూ కలిసి కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. సమతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షుడు వీవీ.కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సిద్ధార్థ ఆడిటోరియంలో సంక్రాంతి ఆత్మీయ కలయిక జరిగింది. కార్యక్రమం ప్రారంభ సందర్భంగా సమతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షుడు వీవీ.కృష్ణారావు మాట్లాడుతూ పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచం మొత్తం ఒక గ్రామంగా మారిందని, జీవన విధానంలో మార్పులు చాలా వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. సమాజాభివృద్ధికి ఏమి చేయాలనే ఆలోచనలపై చర్చించేందుకు ప్రతి ఏడాది సంక్రాంతి ఆత్మీయ కలయికను నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ



ఓట్ ఫర్ బెటర్ ఇండియా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నరహరిశెట్టి నరసింహారావు, అక్కినేని భవానీ ప్రసాద్, పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, వివిధ రంగాలకు చెందిన వారు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి అభిప్రాయాలను తెలియజేశారు. అక్కినేని భవానీ ప్రసాద్ ముద్రించిన ఓట్ ఫర్ బెటర్ ఇండియా పుస్తకాన్ని ఆవిష్కరించారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని పేద ప్రజలకు వైఎస్సార్ బీమా పథకం అండగా నిలుస్తోందని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. 58వ డివిజన్‌లోని 258వ వార్డు సచివాలయం పరిధిలో షేక్ మొహమ్మద్ కాలేషా, పసుపులేటి శివపార్వతి అనే ఇద్దరు వ్యక్తులు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా ఇరు కుటుంబాలకు తక్షణ సాయంగా చెరో రూ.10 వేలను డెప్యూటీ మేయర్ శ్రీశైలజ శనివారం అందించారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.10 వేలు అందించామని, మిగిలిన రూ. 90 వేల బీమా సొమ్మును కూడా త్వరలోనే ఇరు కుటుంబాలకు అందిస్తామని పేర్కొన్నారు.